సాక్షి తిరుపతి
శనివారం ౹ 28 ౹ డిసెంబర్ ౹ 2024



పరిశోధనలు అవసరం
క్యాన్సర్ వ్యాక్సినేషన్‌పై పరిశోధనలు అవసరమని అమెరికా యూనివర్సిటీ అధ్యాపకుడు సూచించారు. - 8లో



వెంబడించి..ఏడిపించి
ఓ మహిళ తన భర్తను ఆస్పత్రిలో చూపించేందుకు నగలు తాకట్టు పెట్టి తీసుకొస్తున్న డబ్బును ఇద్దరు మహిళలు తస్కరించారు. - 8లో



జాతీయ నాటక పోటీలు
తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జాతీయ నాటక పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

డీడీఈ పీజీ సైకాలజీ ఫలితాలు విడుదల
తిరుపతి సిటీ: ఎస్వీయూ డీడీఈ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన పీజీ సైకాలజీ ఫైనల్ ఇయర్ ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి సూచించారు.

జాబ్ మేళాలో 33 మంది ఎంపిక
తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించి ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు 33 మంది ఎంపికై నట్లు ఆ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పీ.అచ్యుతరామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల జనరల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ వీ.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

'దీపం-2'లో 2,99,095 మందికి.. రీయింబర్స్‌మెంట్
11,913 మందికి నగదు జమ కావాల్సి ఉంది

తిరుపతి అర్బన్: ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా 4 నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదిలో మూడు సిలిండర్లకు నగదు రీయింబర్స్‌మెంట్ ద్వారా అందిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు 3,11,008 మందికి జిల్లాలో గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేశామని వెల్లడించారు. అయితే వారితో 2,99,095 మందికి గ్యాస్ నగదు రీయింబర్స్‌మెంట్ చేశామని స్పష్టం చేశారు. మిగిలిన 11,913 మందికి సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు వారి బ్యాంక్ ఖాతాలో జమవుతుందని పేర్కొన్నారు. ఒక వేళ నగదు జమ కాకుంటే అలాంటి వారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవడంతో పాటు తమ బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డును అనుసంధానం చేయించుకోవాలని ఆయన సూచించారు.

వరి ధాన్యం క్వింటాల్ రూ.2,320



మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: రబీకి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 89,615 హెక్టార్లలో వరి సాగు చేశారని, ఇందులో మొత్తం 5,60,093 మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని జేసీ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ సభ్యులైన జిల్లా పౌరసరఫరాల శాఖ, జిల్లా పౌరసరఫరాల సంస్థ, జిల్లా వ్యవసాయ శాఖ, అగ్రికల్చరల్ మార్కెటింగ్, జిల్లా కో-ఆపరేటివ్ సంస్థ, రైతు ఉత్పత్తిదారుల సంస్థకు చెందిన అధికారులతో ఆయన చర్చించారు. గ్రేడ్-ఏ రకం క్వింటా రూ.2,320, సాధారణ రకం రూ.2,300కి కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. జనవరి 3వ వారానికి వరి కోతలు ముగించేలా చూడాలని చెప్పారు.

బీఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు
తిరుపతి సిటీ: ఎస్వీయూ బీఫార్మసీ కోర్సులో మిగిలి ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఏపీసెట్ - 2024లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, ఇంటర్మీడియెట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కోర్స్ ఫీజు ఏడాదికి రూ.81 వేలు చెల్లించాలని, విద్యార్థులు ర్యాంక్ కార్డ్, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సోమవారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. ప్రవేశం పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదన్నారు.

సర్దు పోటుపై.. జనాగ్రహం!



తిరుపతి జిల్లాలో కదం తొక్కిన నేతలు
- తిరుపతిలో మూడు వేల మందితో ర్యాలీ
- విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరు
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పాదయాత్రలు, ర్యాలీలు
- వందలాదిగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు
- కూటమి నేతల తీరును ఎండగట్టిన వైనం
- విద్యుత్‌శాఖ కార్యాలయాలను చుట్టుముట్టి నిరసన

కూటమి సర్కారు సర్దుపోటు చార్జీలపై వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కదం తొక్కారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్లకార్డులు చేతబట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. బాబూ బాదుడుకు జనం గుండె గు'బిల్లు' మంటోందని నినదించారు. బాబు బాదుడేందురో.. కూటమి తీరు మారదురో..! అంటూ హోరెత్తించారు. కల్లబొల్లిమాటలతో అధికారం చేపట్టి నెలలు గడవకనే సర్దుబాటు చార్జీల పేరుతో జనం నడ్డివిరవడం విడ్డూరమని మండిపడ్డారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో జనాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఆయా సబ్‌స్టేషన్లలోని అధికారులు, సిబ్బందికి వినతి పత్రాలు సమర్పించారు.



తిరుపతిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి ప్రభుత్వం కుయుక్తులను నేతలు, కార్యకర్తలు ఎండగట్టారు. సర్దుపోటు చార్జీలపై జనం మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు పర్యాయాలు విద్యుత్ చార్జీల పెంచడం విడ్డూరమని పేర్కొన్నారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరుబాటకు జనం పోటెత్తారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ఆ పార్టీ శ్రేణులు, నేతలు, స్థానికులు భారీగా తరలివచ్చారు. జిల్లా కేంద్రమైన తిరుపతి నగరంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటకు సుమారు మూడు వేల మందికిపైగా తరలివచ్చారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి జనం భారీగా తరలివచ్చారు. పద్మావతిపురంలోని భూమన కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీ శ్రీనివాస కల్యాణ మండపాల మీదుగా ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వరకు సాగింది. పార్టీ శ్రేణులు, స్థానికులు కరెంట్ చార్జీలు తగ్గించాలంటూ నినదించారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలను పెంచేది లేదని, అలాగే నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, వీలైతే చార్జీలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీల్ని గుర్తుచేస్తూ నాయకులు నినాదాలు మిన్నంటించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రజానీకంపై భారం వేయడం దుర్మార్గమన్నారు. వెంటనే సర్దుబాటు చార్జీలను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. లో తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- చంద్రగిరిలో ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డిమోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టవర్ క్లాక్‌వద్ద విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం ట్రాన్స్‌కో కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని అక్కడి అధికారులకు వినతిపత్రం అందించారు.
- శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు శ్రీలక్ష్మీకామాక్షి కల్యాణ మండపం నుంచి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- వెంకటగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటకు కలువాయి, రాపూరు, సైదాపురం, డక్కిలి, వెంకటగిరి మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు తరలివచ్చారు. వెంకటగిరి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడీ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతి పత్రం సమర్పించారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటకు స్థానికులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వరకు సాగిన ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానికులతో కలిసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.
- గూడూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, కార్యకర్తలు, స్థానికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోసగాడు చంద్రబాబు
ప్రజలపై అబద్ధాల అస్త్రాన్ని ప్రయోగించడమే చంద్రబాబు నీచత్వానికి నిదర్శనం. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచనంటూ సూపర్‌సిక్స్‌లో ప్రధాన హామీగా చంద్రబాబు ఇచ్చారు. ఇప్పుడు రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీలు పెంచేశారు. ఒక్కో కుటుంబంపై ప్రతి నెలా రూ.400 అదనపు భారం పడుతోంది.

– భూమన కరుణాకరరెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు



చంద్రగిరి : మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన



తిరుపతిలో ఎస్పీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, తిరుపతి సమన్వయ కర్త అభినయ్ రెడ్డి

ప్రజాసమస్యలు పట్టవా?
ఎంతసేపు అధికారం, సీఎం కుర్చీ తప్ప ప్రజల సమస్యలు, ప్రజా సంక్షేమం చంద్రబాబుకు పట్టేటట్టు లేదు. అధికారంలోకి రావడం కోసం నోటికి వచ్చినట్లుగా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగించారు. ప్రజలకు మేలు చేయకపోగా విద్యుత్ చార్జీల భారంతో వారి నడ్డి విరుస్తున్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి.

– డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

బాబు దిగజారుడు తనానికి నిదర్శనం
అధికారం కోసం ఎంతకైనా దిగజారే తత్వం చంద్రబాబుది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలి. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

– డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ



వెంకటగిరిలో ర్యాలీగా వెళ్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



గూడూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో ర్యాలీ



నాగలాపురంలో నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పోరుబాట



నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆధ్వర్యంలో నిరసన



శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఇతర నేతలు


బెదిరింపులకు బెదరం



బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి అభివృద్ధి కన్నా వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టడంపైనే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ధ్వజమెత్తారు. పచ్చ మీడియాలో బొజ్జల సుధీర్‌రెడ్డి, తాను కలిసిపోయామని రాయడం బాధాకరమన్నారు. బొజ్జల కుటుంబంపై వ్యతిరేకంగా పనిచేసిన గతంలోని మాజీ ఎమ్మెల్యేలు, నాయకులందరూ వారితో కలిసిపోయారని గుర్తు చేశారు. చచ్చే వరకు బొజ్జల కుటుంబంపై ఇదే విధంగా కొనసాగుతామని, వారితో కలిసి పనిచేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. నిరాధారంగా పత్రికల్లో వార్తలు రాయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు నినదించారు. చంద్రగిరి నాగాలమ్మ కూడలి మీదుగా టవర్ క్లాక్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్మెట్లు చేతబట్టి అవగాహన కల్పించారు. - చంద్రగిరి

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



ఏర్పేడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రేణిగుంట(ఏర్పేడు): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన ఏర్పేడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, గదులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రూపు తగాదాలు లేకుండా కౌన్సెలింగ్ ఇచ్చి ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు గస్తీని ముమ్మరం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా బ్లూ కోల్ట్స్, రక్షక వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించాలని చెప్పారు. స్టేషన్ పరిధిలో దొంగతనాలు జరగకుండా అదనంగా నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జయచంద్ర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగల ముఠా

సత్యవేడు: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన శుక్రవారం సత్యవేడులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం ఉదయం ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో ఊత్తుకోట నుంచి సత్యవేడుకు వస్తున్న మారుతి సుజికీ వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో బంగారు నగలు ఉన్నాయి. అనుమానం వచ్చి కారులోని ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు తమిళనాడు వేళపురం, తరువణ్ణామలై జిల్లాకు చెందిన వీ.కన్నదాసన్(26), ఎస్.రంజిత్‌కుమార్(19), బిల్లు అలియాస్ శ్రీరామ్(19), రవి(27), కార్తికేయన్(18)గా గుర్తించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి అరెస్టు చేశారు. ఫిబ్రవరి 26న సత్యవేడు మండలం, శిరణంబూదూరు, దాసుకుప్పంలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో 40 గ్రాముల బంగారాన్ని దొంగలించినట్టు అంగీకరించారు. అలాగే తమిళనాడులోని ఈరోడ్డు బైపాస్‌లో టీఎస్ 5883 నంబరు గల వాహనాన్ని దొంగలించినట్టు ఒప్పుకున్నారు. తమిళనాడులోని మాదరపాకంలో వాటిని విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. సీఐ మురళి ఆదేశాల మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత



బాధితులకు హ్యాండ్‌బ్యాగ్, నగదును అప్పగిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: హైదరబాద్‌కు చెందిన సూర్యప్రకాష్ కుటుంబం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసింది. ఆలయ ఆవరణలోని ఊంజల్‌సేవ మండపం వద్ద తమ హ్యాండ్‌బ్యాగ్‌ను జారవిడుచుకున్నారు. గుర్తించిన ఆలయ సిబ్బంది దానిని అధికారులకు అందజేశారు. అందులో రూ.99,260 నగదు, రెండు సెల్ ఫోన్లు ఉన్నాయి. అందులోని విజిటింగ్ కార్డు ఆధారంగా అనౌన్స్‌మెంట్ చేశారు. అక్కడికి చేరుకున్న భక్తుల వివరాలను అడిగి తెలుసుకుని అప్పగించారు. దీంతో వారు ఆలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్ వ్యాక్సినేషన్‌పై పరిశోధనలు అవసరం

- బయోటెక్నాలజీతో క్యాన్సర్ వ్యాధికి అడ్డుకట్ట సాధ్యమే
- ఆహారపు అలవాట్లు, జీవనశైలితోనే వ్యాధి విజృంభణ
- అంతర్జాతీయ సదస్సులో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: క్యాన్సర్ వ్యాధిని ఆదిలోనే అంతం చేసేందుకు వ్యాక్సినేషన్‌పై పరిశోధనలు జరగాలని, ఈ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాన వక్త అమెరికా అలభామ వర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ మల్ల మిథున్ పేర్కొన్నారు. ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం, అమెరికా అలభామ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సెనేట్ హాల్‌లో క్యాన్సర్ నివారణ మార్గాలపై మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావుతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయోటెక్నాలజీ, మెడిసిన్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరపీ అంశాలపై అంతర్జాతీయ సదస్సు పరిశోధకులకు, విద్యార్థులకు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. మారిన ఆహారపు అలావాట్లు, జీవన శైలి మానవునిపై తీవ్ర పరిణామలు చూపుతున్నాయని, దీంతో చిన్న వయస్సులోనే పలు రకాల క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతుంటం ఆవేదన కలిగించే అంశమన్నారు. పేగు క్యాన్సర్ నిర్వహణలో గణనీయమైన పురోగతి సాధించామని, మైక్రోసాటిలైట్ స్టేబుల్, మెటాస్టాటిక్ కొలొరెక్టల్ కార్సినోమాతో బాధపడుతున్న రోగులకు టార్గెటెడ్ థెరపీ ఎంతో ఉపయోగకరమన్నారు.

బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాలతో చికిత్స విధానం అభివృద్ధి చెందుతోందన్నారు. క్యాన్సర్‌కు వ్యాక్సినేషన్ కనుగొనడంపై విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ వ్యాక్సినేషన్ అత్యవసరమని, ఆ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ క్యాన్సర్‌కు సరైన చికిత్స విధానం, ఔషధాల లేనందున బయోటెక్నాలజీ ద్వారా వాటికి సరైన చికిత్స విధానాలను రూపొందించవచ్చన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి, కన్వీనర్ డాక్టర్.సరిత, డాక్టర్ జ్యోతికుమార్, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, పరిశోధకలు హాజరయ్యారు.

పరిశోధనలపై అవగాహన



బయోటెక్నాలజీలో మరింత పరిశోధన ప్రయత్నాలు జరగాల్సి అవసరం ఉంది. క్యాన్సర్ వ్యాధి నివారణకు పరిశోధనలు ఎంతో దోహదపడతాయనే అంశం ఈ సదస్సు ద్వారా వక్తలు అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు, మానవుని ఆధునిక జీవన శైలితోనే ఇటువంటి ప్రాణాంత వ్యాధులు ఎక్కువగా సంక్రమించే అవకాశం ఉందన్న విషయం తేటతెల్లమైంది.

-పీ.విలియం వివేక్ రెడ్డి, ఎమ్మెస్సీ, తిరుపతి

నూతన ఔషధాల తయారీ అవసరం



క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రస్తుతం ఉన్న ఔషధాలతో పాటు మరింత మెరుగైన ఔషధాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు అవసరం. క్యాన్సర్ వంటి వ్యాధులు ఆధునిక సమాజంలో అతి పిన్నవయస్సులోనే ఎదుర్కొవాల్సి వస్తుండడం బాధాకరం. వీటిని నివారించేందకు చర్యలు, కట్టడికి చికిత్సలో బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీలో సాధ్యాసాధ్యాలపై సదస్సులో పలు విషయాలను చర్చించడం జరిగింది.

-డాక్టర్ సౌమ్య, న్యూయార్క్ వర్సిటీ, అమెరికా

అడ్వాన్స్ మెడిసన్ రావాలి



క్యాన్సర్ వ్యాధి ఆధునిక కాలంలో కొత్త పుంతలు తొక్కుతోంది. దీనిని కట్టడి చేయడం కోసం మరింత అడ్వాన్స్‌డ్ మెడిసిన్ అవసరం ఉంది. ఇందుకోసం బయోటెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తే కొంతమేర ఫలితాలు సాధించవచ్చు. ఇలాంటి సదస్సులు తిరుపతిలో జరగడం సంతోషకరం

-స్నేహ, ఎమ్మెస్సీ, చైత్ర, పీహెచ్‌డీ, జేఎస్ఎస్ అకాడమీ, మైసూరు

గురవయ్య ప్రాణాలు కాపాడండి



గురవయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి

రేణిగుంట: వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు వీ.ప్రభాకర్ తండ్రి గురవయ్య తనకు తండ్రి సామానులని, ఆయన ప్రాణాలను కాపాడాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి వైద్యసిబ్బందిని కోరారు. అనారోగ్యంతో నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురవయ్యను ఆయన శుక్రవారం పరామర్శించారు. గురవయ్యకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఆయనతో పాటు పట్టణ అధ్యక్షులు ప్రభాకర్ పాల్గొన్నారు.

24 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతి నగరంలో మద్యం తాగి వాహనాలను నిర్లక్ష్యంగా నడిపిన కేసుల్లో 24 మందికి ఒక్కొక్కరికీ పది వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించినట్టు వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 24 మధ్యపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు పేర్కొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రులకు సిఫార్సులేంటి?

– ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్



గూడూరు ఏరియా ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్

చిల్లకూరు: ప్రభుత్వాస్పత్రిలో కాన్పులకు వచ్చిన వారిని ప్రయివేటు ఆస్పత్రికి సిఫార్సులు చేయడమేంటి? అని గూడూరు ఏరియా ఆస్పత్రి వైద్యులను కలెక్టర్ వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. ఆస్పత్రిలో పాత సామాను ఉంచుకోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేసారు. శుక్రవారం కలెక్టర్ గూడూరు ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ బెడ్లపై దుప్పట్లు అప్పటికప్పుడు వేసి ఉండడాన్ని గుర్తించి, ఇప్పుడు వేశారేంటి? అని ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో వినియోగించిన కొన్ని పరికరాలను అక్కడే ఉంచడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. వైద్యులు ఎలా సేవలందిస్తున్నారనే విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిల్లకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి అస్వస్థతకు గురికాగా ఆమెతో మాట్లాడారు. ఉన్నత చదువులకు సహకారం అందిస్తామని చెప్పి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు అప్పగించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనాతో మాట్లాడుతూ కాన్పుల సంఖ్య ఎందుకు తగ్గుతున్నాయో చెప్పాలన్నారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. నూతన భవనాన్ని రూ.23 కోట్లతో నిర్మిస్తుండగా కొన్ని పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉందన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కలెక్టర్‌తో మాట్లాడారు. పోస్టు మార్టం గది ముందు ఉన్న ప్రహరీ గోడ కూలే స్థితిలో ఉందన్నారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే రూ.18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రారంభమైన జాతీయ నాటక పోటీలు



జ్యోతిప్రజ్వలన చేసి జాతీయ నాటక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: కోనేటి సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 63వ వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజుల పాటు తలపెట్టి జాతీయ నాటక పోటీలు శుక్రవారం మహతి కళాక్షేత్రంలో వేడుకగా ప్రారంభమాయ్యయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామిక వేత్త మబ్బు సూర్యనారాయణరెడ్డి ,తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం .వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నాటక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటకం, నటనే ప్రాణంగా 63 ఏళ్లుగా నాటక కళలను దేశ వ్యాప్తంగా ప్రదర్శిస్తూ కళను, కళాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు అభినందనీయుడని కొనియాడారు. సుబ్బరాజు నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు మహతిలో నాటక పోటీలను చేపట్టడంతో పాటు ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అశ్వ అవార్డులతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అనంతరం విశాఖపట్నం నటరాజ డ్రమటిక్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన 'పుత్రదేవోభవ' సాంఘిక నాటిక చక్కటి సందేశాత్మకంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒంగోలు ఎన్‌టీఆర్ కల్చరల అసోసియేషన్ వారు ప్రదర్శించిన హెచ్చరిక నాటిక ప్రేక్షకుల హృదయాల్లో ఆలోచనలు రేకెత్తించింది. అనకాపల్లికి చెందిన శ్రీషిరిడీ సాయి కల్చరల్ క్రియేషన్ వారు ప్రదర్శించిన 'ఆశకదరా శివా' నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ప్రతినిధులు గోపాల్‌రావు, కేశవులురెడ్డి, వేమూరు సుబ్రమణ్యం , నారాయణస్వామి, శ్రీధర్, యశోద పాల్గొన్నారు.



ఆశగదరా శివా నాటకంలోని దృశ్యం

వైఎస్సార్‌సీపీలో చేరిక



బాలసుబ్రహ్మణ్యంరెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్: తడ ప్రాంతానికి చెందిన కొంతమంది నాయకులు శుక్రవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తడ మండలం , వెండ్లురుపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వేనాటి బాల సుబ్రహ్మణ్యంరెడ్డితోపాటు ఆయన అనుచరులు కలిసి నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయనకు మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తడ మండల పార్టీ కన్వీనర్ ఆర్ముగం, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా బంజారా జనసంగ్ అధ్యక్షులు మూడే హరిచౌహాన్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతికి బంజారాల సంప్రదాయాలు నిలువుటద్దమని పార్లమెంట్ సభ్యులు ఆజ్మీర్ సీతారాం నాయక్ కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆయన ఎస్వీయూ వీసీ అప్పారావుతో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీవారితో 12వ శతాబ్దిలో పాచికలు ఆడిన బంజారా ముద్దుబిడ్డ హథీరాంజీ భావాజీ అని గుర్తుచేశారు. బంజరా సామాజిక వర్గానికి దక్కిన అవకాశం, గౌరవం, భక్తి అని కొనియాడారు. అనంతరం బీజేఎస్ అధ్యక్షులు మూడే హరిచౌహాన్ నాయక్ మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాల్యా వెంకటేష్ నాయక్, వినోద్ రాథోడ్, హేమంత్‌నాయక్, చంద్రశేఖర్ నాయక్ మధుకర్ నాయక్, నాగేంద్ర నాయక్, బాణావత్ వెంకటేష్ నాయక్, కిషోర్ నాయక్ ప్రియాంక నాయక్, రాజానాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పాత బకాయిలు ఇవ్వందే బోట్లు నడపం



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ

తడ: ఫ్లెమింగో ఫెస్టివల్ కోసం పులికాట్ సరస్సులో బోటు షికారుకు బోట్లు ఏర్పాటు చెయ్యాలంటే గతంలో నిర్వహించిన ఫెస్టివల్ సమయంలో బాకీ పడ్డ ఐదు లక్షల 10 వేల రూపాయలు చెల్లించాలని మత్స్యకారులు అధికారులకు తేల్చిచెప్పారు. జనవరిలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సన్నాహకాల్లో భాగంగా పొన్నేరికి చెందిన ఎఫ్‌డీఓ హిమజ శుక్రవారం మత్స్యకార సంఘ నాయకులతో తడ ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. బోటు షికారు కోసం మత్స్యకార సంఘ నాయకులు, మత్స్యకారులు, బోట్ల యజమానులు సహకరించి ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన బీవీపాళెం, ఇరకం గ్రామాల నాయకులు మాట్లాడుతూ ఫెస్టివల్ నిర్వహించడం అందరికీ సంతోషమని, అదే సమయంలో బోటు షికారు కోసం ఇచ్చే మొత్తాన్ని సక్రమంగా ఇచ్చేలా హామీ ఇవ్వాలని కోరారు. 2017 – 2018లో నిర్వహించిన ఫెస్టివల్ సమయంలో ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఆ మొత్తాన్ని వెంటనే ఇప్పించాలని కోరారు. మత్స్యకార నాయకులు బొమ్మన్ పళని, కోడి ప్రకాష్, ఏకాంబరం, వినోద్, జయపాల్, సుధాకర్, మనోహర్ పాల్గొన్నారు.

బతుకుదెరువుకు వెళ్తూ..!

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- ఏడుగురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన సోమయ్య

గూడూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ఏడుగురు గాయపడిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. స్థానిక ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం.. అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరు మండలానికి చెందిన సోమయ్య, నాజాల సూర్యప్రకాష్, తుంగా భాస్కర్, సత్యాల చినవెంకటయ్య, నాజాల రమణయ్య, రాయిబోయిన పెంచలయ్య, చిట్వేలి మండలానికి చెందిన దాడిశెట్టి సుబ్రహ్మణ్యం, కట్టా ఈశ్వరయ్య తమ జీవాలను తీసుకుని విక్రయించుకునేందుకు మినీ లారీలో గురువారం అర్ధరాత్రి చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు వద్ద నిర్వహించే గొర్రెల సంతకు బయలుదేరారు. వేకువజామున గూడూరు మండలం, చెన్నూరు సమీపంలోకి వచ్చే సరికే ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ లారీలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది గాయపడ్డారు. అందులో కోడూరు మండలం, పిట్టువారిపల్లెకి చెందిన కందల సోమయ్య(45) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. అటుగా వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని క్షత గాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అందర్నీ నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో గుర్రప్పతోట గ్రామం వద్ద శుక్రవారం ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి పైగా అయ్యప్ప భక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. విజయనగరం ప్రాంతానికి చెందిన 25 మంది అయ్యప్ప భక్తులు శబరిమలై యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణంలో విజయనగరానికి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో గుర్రప్పతోట గ్రాం వద్ద మరమ్మతులకు గురైై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని 20 మంది భక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించారు.

ట్రాన్స్‌జెండర్ లక్షణాలుంటే..

- కౌన్సెలింగ్‌తో పాటు విద్యతో భవితకు భరోసా
- పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు

తిరుపతి రూరల్: ట్రాన్స్‌జెండర్ లక్షణాలు కనిపించే విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక కౌన్సెలింగ్‌తో పాటు విద్యతో భవిష్యత్‌కు భరోసానివ్వాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్యాశాఖాధికారులు తెలిపారు. రామచంద్రాపురంలోని ఓ ప్రైవేటు స్కూల్లో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల ప్రధానోపాధ్యాయులకు 6వ విడత లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం 'తేడా పిల్లలను'గుర్తించి విద్యనందివ్వడంపై మాట్లాడారు. యుక్తవయస్సుకు వచ్చే దశలో వారి నడక, నడత, హావభావాలు మారిపోతుంటాయని, దీంతో సహచర విద్యార్థులు, కుటుంబం, ఇటు సమాజం నుంచి వివక్షకు గురవుతుంటారన్నారు. ఫలితంగా చదువులకు స్వస్తి పలికి చివరకు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీలో కలిసిపోతుంటారన్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా హెచ్‌ఎంలు హైస్కూల్ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ లక్షణాల పిల్లలను గుర్తించి ఆ పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి విద్యనందిస్తే వారి భవితకు దారి చూపుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్‌కు పోలీసు ఉద్యోగం సైతం ఇచ్చిందని, దీన్ని స్ఫూర్తిగా తీసుకుని తేడా పిల్లల భవితకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఏఎంఓ శివశంకర్, భాస్కర్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు తిరుపతి విద్యార్థులు



రమ్య



మహిమరాజు



లోకేష్



రమేష్



అంజలి

తిరుపతి సిటీ: జనవరి 26న ఢిల్లీ వేదికగా జరిగే గణతంత్ర దినోత్సవానికి తిరుపతిలోని పలు విద్యాసంస్థలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్, ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికయ్యారు. ఇందులో పద్మావతి మహిళా వర్సి టీ ఎన్ఎస్ఎస్ యూనిట్–4కు చెందిన వలంటీర్ ఎం.రమ్య, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు మహిమరాజు, లోకేష్, రమేష్, అలాగే ఎస్వీ వెటర్నరీ కళాశాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు అంజలి ఎంపికయ్యారు. అరుదైన అవకాశం దక్కించుకున్న విద్యార్థులను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు అభినందించారు.

వెంబడించి..ఏడిపించి!

- పట్ట పగలే సినీఫక్కీలో రూ. 2.83 లక్షలు చోరీ
- తల్లడిల్లిన బాధితురాలు



నగదు చోరీకి గురికావడంతో గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న పొలెమ్మ

నాయుడుపేట టౌన్: పట్టణంలో పట్టపగలే సినిఫక్కీలో సంచిలో పెట్టుకుని ఉన్న రూ.2.83 లక్షల నగదును ఇద్దరు గుర్తుతెలియని మహిళలు చోరీ చేశారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు, పోలీసుల కథనం.. మండల పరిధిలోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన మల్లి పొలెమ్మ భర్త జానయ్యకు ఆరోగ్యం సరిలేదు. ఆస్పత్రిలో చూపించుకునేందుకు నగదు అవసరమైంది. దాంతో పొలెమ్మ శుక్రవారం ఇంటి వద్ద నుంచి బంగారు నగలు తీసుకుని నాయుడుపేట స్టేట్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టింది. వచ్చిన రూ.2.83 లక్షల నగదును కవర్‌లో చుట్టి తాను తెచ్చిన కర్రల సంచిలో పెట్టింది. బ్యాంక్ నుంచి నేరుగా పట్టణంలో పాత వెల్‌కం సెంటర్ వద్ద ఉన్న ఓ దుకాణంలో సరుకులు కొనుగోలు చేసుకునేందుకు వెళ్లింది. ఆమె వద్ద ఉన్న కర్రల సంచి దుకాణం ముందు పెట్టి సరుకుల కోసం లోపలకు వెళ్లింది. కొంతసేపటికే దుకాణం ముందు ఉంచిన కర్రల సంచిలో పెట్టిన నగదు కవర్ కనిపించకుండా పోయింది. దంతో గుండెలు బాదుకుంటూ తన నగదు ను ఎవరో కాజేశారని తల్లడిల్లిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దుకాణం సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఇద్దరు గుర్తుతెలియని మహిళలు దుకాణం వద్దకు వచ్చి సంచిలో ఉన్న నగదును అపహరించుకుని ఆటోలో వెళ్లిపోవడాన్ని గుర్తించారు. అయితే ఆ ఇద్దరు మహిళలు బ్యాంక్ నుంచే వెంబడించి నగదు చోరీ చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పరారైన మహిళల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.